దారిలేక.. ఎవరూ చేరక!

- నిరుపయోగంగా గురజాల పునరావాస కాలనీ
- గృహాల్లో చేరేందుకు ఆసక్తి చూపని వరద బాధితులు
- దారిలేకపోవడం, ఊరికి దూరంగా ఉండటమే కారణం
- శిథిలావస్థలో బడి, నీటి ట్యాంకులు
- బీటలువారుతున్న ఇళ్లు



ఇళ్ల చుట్టూ ముళ్ల కంప చెట్లు పెరిగి నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న పునరావాస కాలనీ


నందవరం : 2009 వరద బాధితులకు ఆదుకునేందుకు అప్పటి ప్రభుత్వం పునరావాస కాలనీలు ఏర్పాటు చేసి గృహాలు నిర్మించి ఇచ్చింది. అయితే అందులో సౌకర్యాలు లేకపోడవడం, కాలనీ ఊరికి దూరంగా ఉండటంతో ఎవరూ చేరక నిరుపయోగంగా మారి నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. బడి, నీటి ట్యాంకులు వృథాగా మారాయి. ఖర్చు చేసిన రూ. కోట్లు బూడిదలో పోసిన పన్నీరు అయ్యాయి. లక్ష్యం నిరుగారి పోగా, విలువైన గృహాల సామాగ్రి చోరీకి గురైయింది.

320 గృహాల నిర్మాణం..

2009 అక్టోబర్ 1,2 తేదీల్లో వరద మిగిల్చిన బీభత్సానికి సర్వం కోల్పోయిన గురజాల వాసుల కోసం పునరావాస కాలనీని ఏర్పాటు చేశారు. పునరావాసం కింద 320 వరద బాధితుల కుటుంబాలకు అప్పట్లో ఇళ్లు నిర్మించారు. పిల్లల చదువు కోసం బడి, తాగునీటి సరఫరా కోసం ట్యాంకును నిర్మించారు. కరెంటు సౌకర్యం కోసం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే కాలనీ ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటం, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలనీకి వెళ్లాలంటే నాగలదిన్నెకు వెళ్లి చుట్టూ తిరిగి రావాల్సి ఉంది. గృహాలు కూడా చిన్నగా ఉన్నాయి. అలాగే తాగునీటి ట్యాంకు ఉన్నప్పటికీ కుళాయిలు, స్తభాలు ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరా లేకపోవడం, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వరదబాధితులు కొత్త కాలనీలోకి చేరడానికి జనం మొగ్గు చూప లేదు. దీంతో బాధితుల కోసం నిర్మించిన ఇళ్లు, పాఠశాల భవనం, తాగునీటి ట్యాంకు, మినీ ట్యాంకులు, విద్యుత్ స్తంభలు వృథాగా మిగిలిపోయాయి.

చోరీకి గురైన సామగ్రి

పాలకులు, అధికారులు కూడా వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇవ్వకపోవడంతో నాటి నుంచి నేటి వరకు ఈ కాలనీ నిరుపయోగంగా మారింది. ఇళ్లకు బిగించిన తలుపులు, కిటికీలు, పాఠశాల భవనంలో అమర్చిన బండలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు.



ఎవరికి ఉపయోగపడని మంచి నీటి ట్యాంకు

నిర్వహణ లేక భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ కాలనీను నాగలదిన్నె వరద బాధితులకు, చేనేత కార్మికులకు మగ్గం చేసుకునేందుకు అప్పగిస్తే అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వృథాగా ఉన్న వరద కాలనీ పై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.



ఇంటికి తలుపులు లేని దృశ్యం



వృథాగా మిగిలిపోయిన పాఠశాల భవనం

ఊరికి దూరంగా ఉండడంతో విముఖత



గురజాల గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో వరద కాలనీ నిర్మించడంతో అయిష్టత ఏర్పడింది. వరద కాలనీకి చెరువు కోవాలంటే 2 కిలో మీటర్ల దూరం ఉంది. అందులో రహదారి కూడా లేదు. నాగలదిన్నెకు వెళ్లి వరద కాలనీకి వెళ్లాలి. దీంతో గ్రామస్తులు ఆ కాలనీకి వెళ్లాడానికి ఇష్టపడడం లేదు.

– కురవ వీరస్వామి, గ్రామ సర్పంచ్, గురజాల

వినియోగంలోకి తీసుకురావాలి



గురజాల గ్రామానికి వరద కాలనీ నిర్మించారు. కానీ అక్కడ నివాసం లేక నిరుపయోగంగా గృహాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వరద కాలనీలో రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు కల్పించాలి. నిర్మానుష్యంగా ఉన్న కాలనీ వినియోగంలోకి తీసుకురావాలి.

– నరసింహులు, రైతు, నాగలదిన్నె

క్లుప్తంగా

ఐఆర్, డీఏలు మంజూరు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం 30శాతం ఐఆర్‌తో పాటు డీఏలను వెంటనే మంజూరు చేయాలని పీఆర్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ వైష్ణవ కరుణానిధి మూర్తి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పీఆర్‌టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను స్థానిక ఎంఈఓ మధుసుదన్‌రాజు, నందవరం, గోనెగండ్ల ఎంఈఓలు సుదర్శన్‌రెడ్డి, రామాంజినేయులు, హెచ్‌ఎం ఈశ్వర్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ, అధ్యక్షుడు రవి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రుణ సదుపాయం

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ రుణ సదుపాయం కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రాలయం రోడ్ శాఖ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బీ కార్యాలయంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఉద్యోగులను కలసి ఎస్‌బీఐ కల్పిస్తున్న రుణ సౌకర్య వివరాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని, గ్యారెంటీ, మార్టగేజ్ అవసరం లేకుండా రూ. 35 లక్షల వరకు ఇస్తామని తెలిపారు. అలాగే ఇప్పటికే రుణం తీసుకున్న వారికి ఎక్కువ మొత్తంలో రెన్యూవల్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పెన్షనర్లకు ప్రత్యేకంగా రూ. 14 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.

ఎరువుల లారీ బోల్తా



ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి క్రాస్ రోడ్ బాబాఫరీద్ దర్గా సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఎరువుల బస్తాలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కర్నూలు నుంచి ఎరువుల బస్తాల లోడును నాగలదిన్నెకు తీసుకెళ్తుండగా లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు కాకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లపై చర్యలు

ఆదోని అర్బన్: అక్రమంగా నకిలీ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేయించిన వారిని, చేసుకున్న వారిని, అధికారులపై చర్యలు తీసుకున్నామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్‌రిజిస్ట్రార్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయించామన్నారు. అంతేగాకుండా అక్రమంగా నకిలీ సర్టిఫికెట్లు పెట్టి రిజిస్ట్రేషన్ చేయించిన పది మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు కూడా పంపడం జరిగిందన్నారు. సమావేశంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, నాయకులు విట్టా రమేష్, మల్లప్ప, కునిగిరి నీలకంఠ, శ్రీకాంత్‌రెడ్డి, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆట స్థలాన్ని కాపాడండి

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆట స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు విల్సన్ కోరారు. గురువారం ఆదోనిలోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పాఠశాల చుట్టూ ఉన్న పొలాల నుంచి వృథాగా పోతున్న నీరు ఆట స్థలంలో వచ్చి గ్రౌండ్ బురదమయంగా మారినా పట్టించుకునే వారు కరువయ్యారని మండిపడ్డారు. ప్రస్తుతం క్రీడా మైదానంలో నిర్మిస్తున్న లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ నిర్మాణాలను నిలిపివేసి, వాటిని పాఠశాల ఆవరణంలోనే వేరేచోట నిర్మించి క్రీడలకు ఆటంకం కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, భీమా అర్జున్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించడం తగదు

ఎమ్మిగనూరుటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్‌షా అవమానించడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఖాశింవలి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అమీత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి పదవికి అమీత్‌షా రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను స్థానిక వడ్డెర సంఘ గౌరవాధ్యక్షుడు వడ్డె బజారి, అధ్యక్షుడు వడ్డె గురుస్వామి ప్రారంభించారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు.

థియేటర్ల యజమానులు నిబంధనలు పాటించాలి

- సంక్రాంతి పర్వదినం సందర్భంగా థియేటర్‌ల నిర్వహణపై మార్గదర్శకాలు
- ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గేమ్ ఛేంజర్, డాకు మహరాజ్ వంటి భారీ బడ్జెట్ సినిమాల విడుదల నేపథ్యంలో థియేటర్ ప్రాంగణాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం నిబంధనలు పాటించాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు గురువారం ఆయన మాట్లాడుతూ థియేటర్ నిర్వహణపై ప్రత్యేక జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. థియేటర్ ప్రాంగణంలో పరిశుభ్రత పాటించాలని, బాత్‌రూమ్‌లు, పార్కింగ్ ప్రాంతం, ఇతర ప్రాథమిక సౌకర్యాలను మెరుగు పరచాలన్నారు. టికెట్ అమ్మకం, ప్రవేశ నియంత్రణ జాగ్రత్తలు చేపట్టి ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌ను ప్రోత్సహించాలని సూచించారు. గుంపుల ఏర్పాటును తగ్గించి, ప్రత్యేక ప్రవేశ పాయింట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గుంపులు ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. థియేటర్ సిబ్బందికి భద్రతా విధానాలు, ప్రజల నిర్వహణపై పూర్తి వివరాలు ముందస్తుగా అందించి, అత్యవసర పరిస్థితుల్లో చర్యలు తీసుకునే ప్రణాళిక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఫుడ్ కోర్టుల్లో ప్రభుత్వం నిర్దేశించి ఎంఆర్‌పీలకు మాత్రమే ఆహారం విక్రయించాలన్నారు. ఎక్కువ ధరలు వసూలు చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పోలీసుల సూచనలు పాటించాలన్నారు.

ఆదర్శనీయురాలు ఫాతిమా షేక్



ఎమ్మిగనూరులో ఫాతిమా షేక్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ సేవలు ఆదర్శనీయమని హెచ్‌ఎం శోభ అన్నారు. షేక్ ఫాతిమా జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక ఎస్ఎంఎస్ హైస్కూల్ ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మహారాష్ట్రలో ముస్లిం సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన ఆమె ఆనాటి దురాచారాలను ఎదిరించి, సాంఘిక కట్టుబాట్లు, సంప్రదాయాల పేరుతో స్త్రీలకు విద్య అందించకుండా దూరం చేసిన సమాజంపై నాడు తిరుగుబాటు చేశారన్నారు.

ఆదోని సెంట్రల్: ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలిగా ఫాతిమా షేక్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలైన ఫాతిమా షేక్ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, శశిధర్, తరుణ్, ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబు



ఉత్తర ద్వారంలో కొలువైన వెంకటేశ్వరస్వామి



ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

ఆదోని అర్బన్: పట్టణశివారులోని తిరుమలనగర్ వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి ఆలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా విద్యుత్ దీపాలతో ఆలయ నిర్వాహకులు, తిరుమల సేవా సంఘం సభ్యులు ముస్తాబు చేశారు. దర్శనం కోసం బారికేడ్లను ఏర్పాటు చేశారు. వేకువజామున వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లకు విశేష పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం స్వామివారి ఉత్తర ద్వారం దర్శనం కల్పిస్తారు. పట్టణంలో కోట వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని కూడా వైకుంఠ ఏకాదశి సందర్భంగా అలంకరించారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

మంత్రాలయం: మండల కేంద్రంలోని పాతవూరులో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు స్వామి వారికి, వైకుంఠ ద్వారానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వైకుంఠ ద్వార ప్రవేశం చేయనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

శాస్త్రవేత్తలకు స్ఫూర్తి స్టిఫెన్ హాకింగ్

ఎమ్మిగనూరుటౌన్: నేటి, భవిష్యత్ తరాలకు, శాస్త్రవేత్తలను స్టిఫెన్ హాకింగ్ స్ఫూర్తి ప్రదాత స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు శంకరయ్య అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో శాస్త్ర వేత్త స్టిఫెన్ హాకింగ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాదన్న, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీ హైస్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో డాక్టర్ బారికి చంద్రశేఖర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థినులకు ట్రస్ట్ నిర్వాహకులు బారికి చంద్రశేఖర్, న్యాయవాది మురళీకృష్ణ, శాప్‌నెట్ వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, షఫీవుల్లా, హెచ్‌ఎం నాగభూషణరెడ్డి బహుమతులు అందజేశారు. అదేవిధంగా స్థానిక నారాయణ పాఠశాలలో ఏజీఎం రమేష్, ప్రిన్సిపాల్ సురేష్, ఏఓ జాకీర్‌ల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు వేషధరణతో సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు.

ఎమ్మిగనూరురూరల్: స్థానిక భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. స్కూల్ అవరణలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. చాంప్స్ ఇన్‌చార్జ్ అనురాధ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఏజీఎం రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తాలూకా సీఐ నల్లప్ప హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ రాజేంద్రప్రసాద్, సిబ్బంది సాయి శంకర్, ఈచాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ జీవని తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో ఎమ్మెల్యే పూజలు



సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలో వెలసిన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో, 52బసాపురం గ్రామంలో వెలసిన సాయిబాబా దేవాలయాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు.

పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇచ్చినట్లు ఎంఈవో-2 మధుసూదన్‌రావు గురువారం తెలిపారు. సెలవుల్లో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. బావులు, చెరువులు, వంకలు దగ్గరకు వెళ్లరాదని, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి ఉంచాలని లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

మంత్రాలయం: మండల కేంద్రంలోని తుంగభద్ర నదిలో గురువారం తహసీల్దార్ సల్కాపురం రవి, రెవెన్యూ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలి స్తున్న 3 ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌కు రూ. 5 వేల చొప్పున జరిమానా విధించారు.

15 నుంచి క్రికెట్ టోర్నమెంట్

మంత్రాలయం: మండల కేంద్రంలోని హెలిప్యాడ్ గ్రౌండ్‌లో 15 నుంచి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు మారెప్ప, బాలు తెలిపారు. రాంపురం జాతర, సంక్రాతి పండుగ సందర్భంగా పోటీలను నిర్వహిస్తున్న పోటీల్లో విన్నర్‌కు రూ. 30 వేలు, రన్నర్‌కు రూ. 20 వేలు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన జట్లు 70951 17006, 98662 90969కి కాల్ చేసి రూ.1200 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గోనెగండ్ల : మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో ఆయా కాలనీలలో తాగునీటి పైపులైన్ వేయడంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కామైందని సర్పంచ్ బజారి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. గ్రామంలో మానుకింది వీధి, పైగేరిలో పాత పగిలి పోయిన పైపులైన్ స్థానంలో పంచాయతీ నిధులతో నూతన పైపులైన్ వేయించామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆదోని రూరల్: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని రజక రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో ఎంపీపీ దానమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అజెండాలోని సమస్యలపై అధికారులు మాట్లాడుతుండగా కొంతమంది సర్పంచులు, ఎంపీటీసీలు, తమ గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి వివరించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్, ఈఓపీఆర్డీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాక కోసం ఎదురుచూసి..

మండల సర్వసభ్య సమావేశానికి ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి హాజరవుతారని తెలియడంతో ఎమ్మెల్యే రాక కోసం ప్రజాప్రతినిధులు ఎదురు చూశారు. సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్దామనుకుంటే ఎమ్మెల్యే గైర్హాజరయ్యారని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

వలంటీర్లను ఎప్పటి నుంచి కొనసాగిస్తారు ?

ఎమ్మిగనూరుటౌన్: గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ప్రజా సేవ చేసిన వలంటీర్లను కూటమి ప్రభుత్వంలో ఎప్పటి నుంచి కొనసాగిస్తారో సీఎం చంద్రబాబు చెప్పాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను కొనసాగించి వారికి రూ.10వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.అయితే అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లను కొనసాగించడంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోగా వలంటీర్లను అవమాన పరిచేవిధంగా మంత్రులు మాట్లాడుతున్నారన్నారు. అనంతరం కొత్తగా ఏర్పాటు చేసిన వలంటీర్స్ యూనియన్‌కు గౌరవ అధ్యక్షుడిగా సురేష్, అధ్యక్షురాలిగా శిరీష, ఉపాధ్యక్షులుగా రవి, సాదిక్, లక్ష్మి, కార్యదర్శిగా నవీన్ తదితరులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తిరుపతి ఘటన



మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఏడుగురు మృతి చెందారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఆరోపించారు. గురువారం ఆమె మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో అమాయక భక్తుల ప్రాణాలు గాలిలోకలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైకుంఠ ఏకాదశి టోకెన్ల కోసం అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ మరణాలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పాలకులు కేవలం క్షమాపణలు చెబితే పోయిన ప్రాణాలు తిరిగి వస్తాయా అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోని ఐదేళ్ల పాలనలో ఎన్నడూ ఇలాంటి ఘోర సంఘటనలు జరుగలేదని, అంతేకాకుండా గతంలోను జరిగిన దాఖలాలు లేవన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇస్తే సరిపోతుందా, వారి కుటుంబాల పరిస్థితి ఏమిటని, అందుకు ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. కూటమి ప్రభుత్వమే ఘటనకు పూర్తి బాధ్యత వహించాలన్నారు.

ఘనంగా దుర్గమ్మ దేవర





ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న దుర్గమ్మ దేవి,కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కోసిగి: మండల కేంద్రంలోని సద్దప్ప పాళెం ఎస్సీ కాలనీలో వెలసిన దుర్గమ్మ దేవి, మారెమ్మ దేవి దేవరను భక్తులు వైభవంగా నిర్వహించారు. గురువారం వేకువ జామున నుంచి దుర్గమ్మ దేవికి వెండి కవచ అలంకరణలు, కుంకుమార్చన, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు ఇంటింటి నుంచి నైవేద్యం తయారు చేసి పూర్ణ కుంభాలలో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఆలయం చెంతకు చేరుకున్నారు. కొందురు భక్తులు దుర్గమ్మ దేవి, మరికొందరు మారెమ్మ దేవికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మా..చల్లంగా చూడమ్మ అంటూ దేవతలను వేడుకున్నారు. అంతకు ముందుగా మురళీ దొర, సుందర్ రాజు దొర, ఎస్ఐ చంద్రమోహన్‌లు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు చంద్రప్ప, ఉరుకుందప్ప, కర్రెన్న, ఎలుకన్న, రమణ, నాగరాజు, చిన్నన్న, గడ్డ ఈరన్న, నరసింహులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కులగణన నుంచి తొలగించాలి

ఆదోని రూరల్: జీఓ నంబర్ 53 ప్రకారం మాదాసి, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వరాదని మాలమహానాడు రాష్ట్ర అడ్వైజర్ చంద్రయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ అన్నారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మాదాసి కురువ, మాదారి కురువలను ఎస్సీ కులగణాల నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ నాయకులు బసాపురం యల్లప్ప, ఆలూరు నియోజకవర్గ నాయకులు భరత్, విజయ్, చాగి, గులెప్ప తదితరులు పాల్గొన్నారు.

సినిమా టికెట్ల అధిక ధరలు నియంత్రించాలి

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలో కొత్త సినిమా విడుదల సందర్భంగా బెనిఫిట్ షోల పేరుతో సినిమా టికెట్లను అధిక ధరలకు విక్రయిస్తూ అభిమానులను, ప్రేక్షకులను నిలువుదోపిడీ చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, మండల కార్యదర్శి ఉచ్చీరప్ప కోరారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

బెనిఫిట్‌షోలను రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: కొత్తగా విడుదల అయ్యే సినిమాలకు బెనిఫిట్ షోలకు అనుమతులు రద్దు చేయాలని ఆర్‌పీవీఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త సినిమాలకు బెనిఫిట్ షోలు, విచ్చల విడిగా టికెట్ల ధరలను పెంచారని ఆరోపించారు. నాయకులు రవినాయుడు, ఈరన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.